క్లుప్తంగా

బాల్య వివాహాలను నిర్మూలించాలి


మాట్లాడుతున్న చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీలక్ష్మి

పీసీపల్లి: బాల్య వివాహాలను నిర్మూలించాలని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసంపై అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నియంత్రించాలని, అందుకు గ్రామస్థాయిలో ఉండేవారు ఎప్పటికప్పుడుప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రాంప్రసాద్ పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రం తనిఖీ


కుట్టు శిక్షణా కేంద్రాన్ని తనిఖీచేస్తున్న ఈఓపీఆర్డీ

పామూరు: స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఈఓపీఆర్డీ జి.అరవిందారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణకు హాజరయ్యే వారి సంఖ్య తక్కువగా ఉండటంపై చర్చించి పూర్తి హాజరు నమోదయ్యేలా చూడాలన్నారు.

ఎంపీడీఓగా వాణి బాధ్యతల స్వీకరణ


కె.వాణి

సీఎస్‌పురం(పామూరు): ఎంపీడీఓగా కె.వాణి మంగళవారం అధికార బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతుల్లో భాగంగా బాపట్ల జిల్లా కొల్లూరు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను సీఎస్‌పురం ఎంపీడీఓగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానన్నారు.

31 నుంచి పెద్దమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం


పెద్దమ్మ ఆలయంవద్ద తిరునాళ్ల పత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం వడ్డెపాలెంలోని పెద్దమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 31వ తేదీ శనివారం నుంచి జూన్ 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈసందర్భంగా మంగళవారం పెట్టిలు దించడం, తిరునాళ్ల ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి, గోను చంద్రశేఖర్‌రెడ్డి, బత్తుల వెంకటాద్రి, వెంకట్రామయ్య, హనుమంతు నాయకులు పాల్గొన్నారు.

18 నుంచి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లెలో ఈ నెల 18వ తేదీ నుంచి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ గ్రామ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పామూరు, సీఎస్‌పురం మండలాలు, నెల్లూరుజిల్లా సీతారాంపురం 3 మండలాల స్థాయిలో ఈక్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఎంట్రీఫీజు రూ.500 చెల్లించి ఈనెల 17వ తేదీ సాయంత్రంలోగా జట్టు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.30,116, రూ.20,116, రూ.10,116 అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 7075906442, 9505085146 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆత్మరక్షణ.. సాహసమే ఊపిరి !

- తైక్వాండోతో ఆత్మస్థైర్యం
- సమ్మర్‌లో తైక్వాండో వైపు వస్తున్న విద్యార్థులు
- గుర్తింపు పొందిన క్రీడ కావడంతో మొగ్గుచూపుతున్న తల్లిదండ్రులు
- ప్రత్యేకత సంతరించుకుంటున్న టీఆర్‌ఆర్ క్రీడా మైదానం


శిక్షణ ఇస్తున్న మాస్టర్ అబ్దుల్ సలామ్

కందుకూరు రూరల్:

చిన్నారులకు మానసిక, శారీరక దృఢత్వం తప్పనిసరిగా ఉండాలి. ఏ విద్యార్థైనా శారీరకంగా చురుకుగా ఉంటాడో మానసికంగా దృఢంగా ఉంటారు. ప్రస్తుతం క్రీడల వైపు పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు పెద్దగా సుముఖత చూపడం లేదు. కార్పొరేట్ చదువులు వచ్చాక కేవలం చదువుపైనే దృష్టి సారిస్తున్నారే తప్ప క్రీడలపై చూపించడం లేదు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో క్రీడా మైదానంలో ఉండదు. దీంతో పాటు పీడీ, పీఈటీ పోస్టులు కూడా నియమించుకోరు. దీంతో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. ఇది కేవలం కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాల తప్పిదమే అనుకోకూడదు. తల్లిదండ్రులు పరిస్థితి కూడా అలానే ఉంది. మా పిల్ల వాడికి ర్యాంకులు రావాలనే చూస్తున్నారే తప్పా వారి మానసిక పరిస్థితి ఎలా ఉందో తెలుచుకోలేకపోతున్నారు. కనీసం సెలవుల్లో కూడా వారిని ఆడుకోనించే పరిస్థితి లేకుండా ప్రత్యేక స్టడీలు, సమ్మర్ కోచింగ్ వంటి వాటికి పంపిస్తున్నారు. పిల్లలు అడుకునే గోలీలాట, కుందురు గుంట, ఉప్పు ఆట, కోతి కొమ్మచ్చి వంటి అనేక రకాల ఆటలు ప్రస్తుతం పిల్లలు మరిచిపోయినట్లుగానే చెప్పారు. దీని కారణంగా విద్యార్థులు శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కూడా తగ్గిపోతుంది.


సాధన చేస్తున్న క్రీడాకారులు

తైక్వాండోతో ఎన్నో అవకాశాలు..

ప్రస్తుతం విద్యార్థులు క్రీడా మైదానానికి వచ్చే క్రికెట్, షెటిల్ వంటివి మాత్రమే ఎక్కువగా ఆడుతున్నారు. దీంతోపాటు అబ్బాయిలు, అమ్మాయిలకు ఆత్మస్థైర్యంతోపాటు, శారీరక ధారుఢ్యం పెంపొందించే క్రీడా తైక్వాండో. ఈ క్రీడ కందుకూరులో మాస్టర్, బ్లాక్ బెల్ట్ ఎస్‌కే అబ్దుల్ సలామ్ టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో తర్ఫీదు నిస్తున్నాడు. సుమారు 35 సంవత్సరాల నుంచి విద్యార్థులకు శిక్షణనిస్తూ ఇంటర్నేషనల్ స్థాయిలో క్రీడాకారులను పంపించి పోటీనిచ్చారు. అనేక మంది తైక్వాండో క్రీడా సరిఫికెట్‌తో వివిధ రంగాల్లో ఉద్యోగ, వివిధ కోర్సుల్లో స్పోర్ట్స్ కోట కింద బెనిఫిట్ పొంది ఉన్నారు. తైక్వాండోకి వచ్చిన విద్యార్థులు క్రమ శిక్షణతో శారీరక దారుఢ్యంతో, మానసిక ఉల్లాసంతో ఉంటున్నారు. ఇలాంటి క్రీడను నేరిప్పించేందుకు మాస్టర్ ఎప్పుడు కూడా వెనుకంజ వేయకుండా తర్ఫీదు ఇస్తూనే ఉన్నారు. వేసవిలో పిల్లలను కస్తా ఎక్కువగానే వస్తున్నారు. ప్రస్తుతం సమ్మర్‌తో త్రైక్వాండోకు 60 మంది పిల్లలు ప్రతి రోజు వచ్చి తర్ఫీదు పొందుతున్నారు.

జాతీయస్థాయిలో పతకం సాధించా..



నేను ఆరో తరగతి నుంచి తైక్వాండో నేర్చుకుంటున్నారు. ప్రస్తుతం సీనియర్ ఇంటర్ చదువుతున్నాను. బ్లాక్ బెల్ట్ సాధించి జాతీయ స్థాయిలో ఆడి సిల్వర్ పతకాన్ని గెలుపొందా. ఆడ పిల్లలకు తైక్వాండో క్రీడ చాలా అవసరం. సెల్ఫ్ డెఫెన్స్‌తో పాటు ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది. శారీరక దారుఢ్యం కూడా మెరుగుపడుతుంది.

బీ అక్షర, బ్లాక్ బెల్ట్..

తైక్వాండో చాలా ఇష్టంతో నేర్చుకుంటున్నా:



తైక్వాండో క్రీడ చాలా ఇష్టంగా నేర్చుకుంటున్నాను. నాలుగేళ్ల నుంచి తైక్వాండో నేర్చుకుంటున్నాను. మా మాస్టర్ సలామ్ బాగా నేర్పిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో సిల్వర్ పతకాన్ని సాధించాను. తైక్వాండో క్రీడ వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుంది.

– టీ సాత్విక్, బ్లూ–1 బెల్ట్

అమ్మాయిలు తప్పనిసరిగా నేర్చుకోవాలి..



తైక్వాండో బాగా నేర్చుకొని ఇంటర్నేషనల్ స్థాయిలో పతకం సాధించాలని ఉంది. దీనికి మా మాస్టర్ చక్కటి తర్ఫీదు ఇస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో ఉదయం, సాయంత్రం నేర్పిస్తున్నారు. అమ్మాయిలకు తైక్వాండో క్రీడా ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది.

– పీ సాయి అక్షరశ్రీ

తైక్వాండో గుర్తింపు పొందిన క్రీడ..



తైక్వాండో క్రీడలో పొందిన సర్టిఫికెట్లు స్పోర్ట్స్ కోటాకు ఉపయోపడతాయి. కొన్ని ఫేక్ క్రీడలు ఉన్నాయి. తల్లిదండ్రులు, విద్యార్థులు అవగాహన పొందిన నేర్పించాలి. తైక్వాండోను సుమారు 35 ఏళ్ల నుంచి నేర్పిస్తున్నాం. ఇంటర్నేషనల్ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఉన్నారు. ప్రతిరోజూ సాధన వల్ల ఆరోగ్య సమస్యలు కూడా రావు.

– ఎస్‌కే అబ్దుల్ సలామ్, మాస్టర్

రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలి

సింగరాయకొండ: మండలంలోని ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ పథకం నమోదు కార్యక్రమం జరుగుతుందని ఏఓ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా రూ.6 వేలు ఇస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం 14 వేల రూపాయలు ఇస్తుందని తెలిపారు. గ్రామాల్లోని వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో ఆన్‌లైన్లో నమోదు చేస్తారని, వ్యవసాయ, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ సాగు భూమి ఉన్న రైతులందరూ ఈ పథకానికి అర్హులని వివరించారు. రైతుల వివరాలను ఆర్టీజీఎస్ ద్వారా వెరిఫై చేసి చివరగా ఈకేవైసీ చేస్తామని వివరించారు. రైతులు తమ గ్రామంలో రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని వివరించారు.

కిశోర వికాసంపై శిక్షణ


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న బి.రత్నప్రన్

హనుమంతునిపాడు: స్థానిక వెలుగు కార్యాలయంలో కిశోర వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్, ప్రొబేషన్ అధికారి బి,రత్నప్రన్, కో ఆర్డినేటర్ వై వెంకటలక్ష్మి కిశోర వికాసంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతుల్లో సంపూర్ణ ఆరోగ్యం, బాల్య వివాహాలు అరికట్టడం, లైంగిక వేధింపులు, లింగ వివక్ష, ఆత్మరక్షణ, సంపూర్ణ విద్య అంశాలపై శిక్షణ ఇచ్చారు. సీడీపీఓ దేవకృపావరం, సూపర్‌వైజర్ షేక్ గౌస్‌న్నీబా బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో ఆగ్రహం

- దొంగ కేసులకు భయపడొద్దు
- జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం
- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్


దద్దాల నారాయణ యాదవ్‌ను సన్మానిస్తున్న నేతలు

వెలిగండ్ల(కనిగిరిరూరల్): అధికారంలోకి వచ్చి 11 నెలలవుతున్నా ఒక్క హామీని అమలు చేయలేని కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక.. ప్రశ్నించిన ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ.. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. వెలిగండ్ల మండలం తమ్మినేనిపల్లి గ్రామంలో జరిగిన పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవంలో సోమవారం రాత్రి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ఏర్పాటు చేసిన తిరునాళ్ల ప్రభ వేదికపై దద్దాల మాట్లాడుతూ.. కూటమి నేతల దొంగ కేసులకు, ఉడత బెదిరింపులకు ఎవరూ భయపడొద్దని, పార్టీ మీకు అండగా ఉంటుందన్నారు. రానున్న రోజులన్నీ వైఎస్సార్ సీపీవేనన్నారు. ఏ సమస్య వచ్చినా పార్టీ, తాను అండగా ఉంటామని దద్దాల భరోసా ఇచ్చారు. మనమంతా సమష్టిగా పనిచేసి జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామన్నారు.

దద్దాలకు ఘన స్వాగతం..

తొలుత స్థానిక పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు దద్దాల నారాయణకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో దద్దాల నారాయణ పార్టీ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ పార్టీ నాయకులు దద్దాల నారాయణను ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, తమ్మినేని శివరామిరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, ఉండేల మాధవ, కర్నాటి రమణారెడ్డి, తమ్మినేని రామిరెడ్డి, పల్నాటి నాగార్జున, పల్నాటి విష్ణు, పల్నాటి భూమ్, ఏకుల వెంకటేశ్వర్లు, ఆవుల తిరుపతిరెడ్డి(ఏటీఆర్), గూడూరి అనీల్, సుధీర్ నాయుడు, చిలకల నారాయణరెడ్డి, కె.వెంకటేశ్వర రెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, తాతపుడి సురేష్, దద్దాల రాములు, ఉండేల వెంకటరెడ్డి, ఆవులు శ్రీనివాసులరెడ్డి, తమ్మినేనిశ్రీనివాసులరెడ్డిపాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముల కళ్యాణం


కళ్యాణోత్సవంలో ఉభయదాతలు పులగం నారాయణరావు, చంద్రకళ

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ఉభయ దాతలుగా పులగం నారాయణరావు, చంద్రకళ దంపతులు వ్యవహరించారు. వేద పండితుల ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం జరగగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తర్వాత అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం నిర్వహించారు. ప్రజలు స్వామి వారికి హారతులిచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. దేవదాయ శాఖ పరిధిలోని ఆలయంలో ఆ శాఖ అధికారులు లేకుండానే కళ్యాణోత్సవం జరిగిందని, ఆలయం పట్ల అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంట దిగుబడిపై అధికారుల సర్వే


గోసుకొండ అగ్రహారంలో తనిఖీ చేస్తున్న సర్వే బృందం

మర్రిపూడి: మండలంలోని గోసుకొండ అగ్రహారంలో ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలపై కేంద్ర, రాష్ట్ర గణాంకాల అధికారులు మంగళవారం సర్వే చేశారు. వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ గోసుకొండ గ్రామాన్ని 4 క్లస్టర్‌లుగా విభజించి ఒక్కో క్లస్టర్ నుంచి 5 సర్వే నంబర్లలో సర్వే చేస్తామని చెప్పారు. 20 మంది రైతుల నుంచి 9 రకాల సమాచారం తీసుకుని రబీ, ఖరీఫ్ సీజనలో సాగు చేసిన పంటలు, దిగుబడి తదితర విషయాలు తెలుసుకున్నట్లు చెప్పారు. జేడీ శ్రీనివాసులు, వినోద్ తారాసింగ్, రామకృష్ణ ప్రసాద్, సుధాకర్, వీఆర్‌ఓ ఏబేలు, కోటేశ్వరరావు, శర్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

శీతల గిడ్డంగుల్లో బేళ్ల వివరాలను తెలియజేయాలి


వేలం నిర్వహిస్తున్న నిర్వాహణాధికారి శ్రీనివాసరావు


వేలాన్ని పరిశీలిస్తున్న సునీల్‌కుమార్

టంగుటూరు: శీతల గిడ్డంగుల్లో ఉన్న పొగాకు బేళ్ల వివరాలు తెలియజేయాలని పొగాకు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనధికారికంగా పొగాకును అమ్మరాదని సూచించారు. క్లస్టర్ పరిధిలోని దావగూడూరు, చింతలపాలెం గ్రామాలకు చెందిన రైతులు 881 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 705 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 176 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.205, సరాసరి ధర కేజీ రూ.250.48గా నిర్ణయించారు. వేలంలో 15 కంపెనీలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

286 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో 286 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పెద్దకళ్లగుంట, నరసరాజుపాలెం, అయ్యప్పరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1188 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 902 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 286 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ. 280, కనిష్ట ధర కేజీ రూ.210, సరాసరి ధర కేజీ రూ. 242.17గా నమోదైంది. వేలంలో 15 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు అందజేత


దాతలు సమకూర్చిన క్రీడా దుస్తులతో క్రీడాకారులు

పామూరు: ఉమ్మడి ప్రకాశంజిల్లా సబ్‌జూనియర్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు స్థానిక సెయింట్‌మార్క్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ బాస్కెట్‌బాల్ క్రీడాప్రాంగణంలో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వలేటి రవీంద్ర పంపిణీ చేశారు. ఈ జట్లకు ఈనెల 7వ తేదీ నుంచి 13వ తేదీవరకు సెయింట్‌మార్క్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ బాస్కెట్‌బాల్ ప్రాంగణంలో కోచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. కాగా ఈ జట్లు చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటాయి. క్రీడాకారులకు పాఠశాల కరస్పాండెంట్ ఎం జయకుమార్ వసతులు కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి జయకుమార్, టి.సుబ్బారావు, సయ్యద్ జిలానీబాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగార్జునను పరామర్శించిన దద్దాల


నాగార్జునను పరామర్శిస్తున్న దద్దాల నారాయణ

పీసీపల్లి: మండల పరిధిలోని కోదండరామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గుడిమెట్ల నాగార్జున ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం ఆయనఇంటికి వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, పెద్దిరెడ్డి ఓకే రెడ్డి, పోలు జయరామిరెడ్డి, అంకబాబు చౌదరి, గుమ్మళ్ల కోటయ్య చౌదరి, మూలే రాజశేఖర్రెడ్డి, బొమ్ము అంజిరెడ్డి, మేకల మాల్యాద్రి, రమేష్ గౌడ్, శీలం సుదర్శన్, పరిమి వెంకట్రావు చౌదరి, పాలగిరి బాలిరెడ్డి, కొండ్రు నరసింహ, నరసింహారెడ్డి, చిలకల నారాయణరెడ్డి, దేసిరెడ్డి బ్రహ్మారెడ్డి, ఉండేల వెంగల రెడ్డి, బోగాల బాల నరసింహ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్


నేర సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కొండపి: కనిగిరి సబ్ డివిజన్ పరిధిలోని పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆదేశించారు. మంగళవారం కొండపిలోని సర్కిల్ కార్యాలయంలో కనిగిరి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పేకాట, కోడిపందేలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రత్యేకంగా పేకాట శిబిరాలు నిర్వహించే వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ప్రతి గ్రామంలో గ్రామస్తుల సహకారాలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి స్టేషన్‌కు కేటాయించిన డ్రోన్ కెమెరాలతో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. పోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. నెల వ్యవధిలో సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 100 కేసులు నమోదైనట్లు తెలిపారు. క్రైమ్ రేట్ తగ్గించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బెట్టింగ్‌లు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం ఉంటే అటువంటి వారిపై నిఘా ఉంచాలని సూచించారు. బెట్టింగ్‌తో ఏ విధంగా నష్టపోతారో యువతకు అవగాహన కల్పించాలన్నారు. మహిళలకు ప్రత్యేకంగా చట్టాలపై అవగాహన కల్పించి విపత్కర పరిస్థితిలో తమను ఏ విధంగా కాపాడుకోవాలో వివరించాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మైదానంలో రెండు టీమ్స్‌గా విడిపోయి క్రికెట్ ఆడారు. కొండపి సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్‌కుమార్, సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


అలంకరణలో చెన్నకేశవస్వామి

హనుమంతునిపాడు: శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం మోహిని ఉత్సవంలో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు, ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. చెక్కావారి గరుడ సేవా కార్యక్రమాలు, పాలెగాళ్ల కత్తి సేవలు పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. రాత్రికి స్వామి ఊరేగింపు, కోలాటాలు, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


పోతురాజు శిలల వద్ద కత్తి సేవ చేస్తున్న చెక్కా వంశస్తులు

నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలి

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఏసీ విజయ


గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సీఎస్‌పురం(పామూరు): నాటుసారా రహిత గ్రామాల నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యతని, అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ కె.విజయ అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని మైలుచర్ల గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటుసారా తయారీ, సేవించడం, రవాణా చేయడం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వినియోగించడం, విక్రయించడం, కలిగి ఉండటం నేరమని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా వాటి వినియోగం వల్ల కలిగే నష్టాలను గ్రామస్తులకు వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా డ్రోన్‌తో నాటుసారా తయారీ ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్.ఖాజామొహిద్దీన్, మార్కాపురం అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.బాలయ్య, ఒంగోలు సూపరింటెండెంట్ జనార్దన్‌రావు, ఎర్ర వెంకట్, కనిగిరి సీఐ ఆర్.విజయభాస్కర్, అటవీశాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.